మన సమగ్ర ప్రజావాణి
RNI NO:TGTEL/25/A5443
ప్రజావాణి ఎప్పటి వార్తలు అప్పుడే...
5 PM
తెలుగు డైలీ
శుక్రవారం , 02, అక్టోబర్, 2026
MANA SAMAGRA PRAJAVANI TELUGU DAILY
https://epaper.prajavaani.net

## గాంధీజీ, లాల్ బహదూర్ శాస్త్రి జయంతి..

# సీఎం రేవంత్‌రెడ్డి నివాళి

- జై జవాన్ - జై కిసాన్ నినాదకర్త లాల్ బహదూర్ శాస్త్రి: సీఎం రేవంత్‌రెడ్డి
- మహాత్మా గాంధీ జీవితం యావత్ మానవాళికి స్ఫూర్తిదాయకం..
- గాంధీ మహాత్ముడి జయంతి సందర్భంగా హైదరాబాద్‌లోని బాపూఘాట్‌లో ఆయన సమాధికి గవర్నర్, సీఎం నివాళులు అర్పించారు.
- గాంధీ చేసిన సేవలను స్మరించుకున్నారు.



**హైదరాబాద్, అక్టోబరు 2 :** జాతిపిత మహాత్మా గాంధీ, భారతరత్న లాల్ బహదూర్ శాస్త్రి జయంతి నేడు. ఈ సందర్భంగా తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఘన నివాళులు అర్పించారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా సీఎం పోస్టు పెట్టారు. అహింసను ఆయుధంగా, సత్యమే మార్గంగా చేసుకుని కోట్లాది భారతీయుల్లో స్వాతంత్ర్య స్ఫూర్తిని రగిలించిన జాతిపిత మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి ఆ మహనీయునికి ఘనంగా నివాళులర్పించారు. సత్యం, అహింస, సహనం, మానవత్వం, సామాజిక బాధ్యత వంటి మహోన్నత విలువలను ఆచరించి, వాటి శక్తిని ప్రపంచానికి చాటిన గాంధీ జీవితం యావత్ మానవాళికి స్ఫూర్తిదాయకమని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. భారతరత్న, మాజీ ప్రధానమంత్రి లాల్ బహదూర్ శాస్త్రి జయంతి సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆ మహనీయునికి ఘనంగా నివాళులర్పించారు. దేశం కోసం నిస్వార్థంగా సేవలందించిన మహోన్నత నాయకుడు అని స్మరించుకున్నారు. 'జై జవాన్ -- జై కిసాన్' అన్న నినాదంతో సైనికుడి ధైర్యాన్ని, రైతు శ్రమను దేశ ప్రగతికి రెండు బలమైన స్తంభాలుగా చాటిచెప్పిన దార్శనికుడని కొనియాడారు. నిజాయితీ, నిరాడంబరత, కర్తవ్యనిష్ఠ, దేశభక్తికి ప్రతిరూపంగా నిలిచినజీవితంనేటితరానికి ఆదర్శప్రాయమని సీఎం పేర్కొన్నారు.

'కెప్టెన్ మచ్చార్ ధైర్యాన్ని ఎందుకు మెచ్చుకోలేదు'..

# కాంగ్రెస్‌పై కిషన్ రెడ్డి ఫైర్



**ఢిల్లీ, అక్టోబర్ 2:** కెప్టెన్ మచ్చార్ సాహసాన్ని చూసి యావద్భారతం గర్వపడుతోందని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. మరో 9/11 తరహా ఘటన జరగకుండా ప్రాణాలను పణంగా పెట్టడాన్ని, అతని ధైర్యసాహసాలను చూసి యావత్ ప్రపంచం హర్షించిందని తెలిపారు. భారతీయుడు ప్రదర్శించిన ధైర్యసాహసాలను గుర్తించి, అభినందించాలన్న ఇంగిత జ్ఞానం కూడా సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీలకు లేకపోవడం ఆశ్చర్యకరమన్నారు. అర్థం పర్థంలేని అంశాలపైనా స్పందించి, తాను ప్రపంచాన్ని మారుస్తున్నట్లు మాట్లాడే రాహుల్ గాంధీ.. ఈ ఒళ్లు గగుర్పొడిచే సందర్భం గురించి, కెప్టెన్ స్మిత్ మచ్చార్ గురించి మాట్లాడటం సంగతి పక్కనపెడితే.. కనీసం ఆయన ధైర్యసాహసాలను అభినందిస్తూ ఒక సోషల్ మీడియా పోస్ట్ కూడా చేయలేకపోయారని విమర్శించారు. అసలు సోనియా గాంధీ కుటుంబం ప్రాబ్లమ్ ఏంటి అని కిషన్ రెడ్డి ప్రశ్నించారు. భారత్ గురించి, భారతీయుల గురించి ఏదైనా మంచి జరిగితే, భారతీయుల శక్తి, సామర్థ్యాలను ప్రపంచమంతా కీర్తిస్తే వారికి ఎందుకు నచ్చదని నిలదీశారు. భారతీయుడు తన ధైర్యసాహసాలతో అంతర్జాతీయ నేతల ప్రశంసలు అందుకుంటుంటే.. నెహ్రూ కుటుం బం జీర్ణించుకోలేకపోతోందని వ్యాఖ్యానించారు. మొదట్నుంచీ కాంగ్రెస్ పార్టీకి ఉన్న అలవాటు ఇది అంటూ మండిపడ్డారు. అందుకే త్వరలోనే కాంగ్రెస్ రాజకీయంగా కనుమరుగు కావడం ఖాయమని కిషన్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు.

## దేశంలోనే తొలి 'ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్'కు

# నేడు అంకురార్పణ




**రాయలసీమ:** రాయలసీమ సమగ్ర అభివృద్ధిలో ఒక చారిత్రక ఘట్టానికి నేడు తెరలేవనుంది. దశాబ్దాలుగా వెనుకబాటుకు గురైన సీమ ముఖచిత్రాన్ని మార్చే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం రెండు భారీ ప్రాజెక్టులకు శ్రీకారం చుడుతోంది. సుమారు రూ.1 లక్ష కోట్ల బృహత్ ప్రణాళికతో రూపుదిద్దుకుంటున్న గ్లోబల్ హార్టికల్చర్ హబ్ (జీహెచ్‌హెచ్), దేశంలోనే తొలి 'ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్' (ఐఎస్ఏ)లకు అన్నమయ్య జిల్లా మదనపల్లెలో నేడు అంకురార్పణ జరగనుంది. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఈ చారిత్రాత్మక కార్యక్రమాల్లో పాల్గొని ప్రాజెక్టులకు శంకుస్థాపన చేయనున్నారు. రాయలసీమ, ఉమ్మడి ప్రకాశం జిల్లాల్లోని ఉద్యాన రైతుల తలరాత మార్చే లక్ష్యంతో ప్రభుత్వం గ్లోబల్ హార్టికల్చర్ హబ్‌ను ప్రతిష్టాత్మకంగా చేపడుతోంది. 'విత్తనం నుంచి ఎగుమతి వరకు' (సీడ్ టు షిప్‌మెంట్) అనే నినాదంతో ఈ హబ్ పనిచేయనుంది. మొత్తం రూ.1 లక్ష కోట్ల ప్రణాళికలో భాగంగా, ప్రభుత్వం తన వాటాగా రూ.40,352 కోట్లు ఖర్చు చేయనుండగా, ప్రైవేట్ రంగం నుంచి రూ.60,000 కోట్ల పెట్టుబడులను ఆకర్షించాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఈ ప్రాజెక్టు కోసం గత ఆరు నెలలుగా ముఖ్యమంత్రి చంద్రబాబు వ్యవసాయ, ఉద్యాన, ఆర్థిక, నీటిపారుదల శాఖలతో సమీక్షలు జరిపి, కేంద్ర ప్రభుత్వంతో సంప్రదింపులు జరిపారు. రాయలసీమ పరిస్థితులను అర్థం చేసుకున్న కేంద్రం, ఈ హబ్‌కు నిధులు సమకూర్చేందుకు అంగీకారం తెలిపింది.

## సాగునీటి ప్రాజెక్టుల 10 ఈపీసీ ప్యాకేజీలకు

# ముగింపు పలికిన కేబినెట్




**హైదరాబాద్ :** సాగు నీటి ప్రాజెక్టుల 10 ఈపీసీ ప్యాకేజీలకు ముగింపు పలికిన రాష్ట్ర మంత్రివర్గం, చిన్న కాళేశ్వరం ఎత్తిపోతల పథకం సవరించిన అంచనాలకు ఆమోదం తెలిపింది. గట్టు ఎత్తిపోతల, బాచారం హైలెవల్ కెనాల్ పనులకు సంబంధించి కీలక నిర్ణయాలు తీసుకొంది. ఇందిరమ్మ వరద కాలువ, ఎస్సారెస్పీ మూడో ప్యాకేజీలో కొన్ని మార్పులకు ఆమోద ముద్ర వేసింది. ప్రాజెక్టులు అసంపూర్తిగా ఉంటే రద్దునీటి పారుదల రంగానికి సంబంధించిన పలు అంశాలపై రాష్ట్ర మంత్రివర్గంలో విస్తృత చర్చ జరిగింది. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులను పునః సమీక్షించాలని కేబినెట్ నిర్ణయం తీసుకుంది. ఇప్పటికే ఇచ్చిన ఆదేశాల ప్రకారం ఈపీసీ (ఇంజినీరింగ్, ప్రొక్యూర్?మెంట్?, కన్?స్ట్రక్షన్?) విధానంలో చేపట్టిన ప్రాజెక్టులు అసంపూర్తిగా ఉంటే రద్దు చేయాలని అధికారులను ఆదేశించింది. ఇందులో భాగంగా 10 ఈపీసీ సాగునీటి ప్రాజెక్టులను నిలిపి వేసేందుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ప్యాకేజీల వారీగా బకాయిలు, కేసులు, ఆడిట్ అభ్యంతరాలు, విజిలెన్స్ అంశాలను పరిశీలించాలని, అన్ని అంశాలను పరిగణలోకి తీసుకొని 10 ప్యాకేజీలను పరస్పర అంగీకారంతో ప్రీ క్లోజర్ చేయాలని నిర్ణయించారు. 2006-2007లో కాంగ్రెస్ ప్రభుత్వం రాజశేఖర్ రెడ్డి హయాంలో ఈపీసీలో టెండర్లు జరిగాయి. ఈ టెండర్లు జరిగి సుమారు 20 సంవత్సరాలు అవుతుంది. కొన్ని పూర్తయ్యాయి. మరికొన్ని అసంపూర్తిగా ఉన్నాయి. 10 సాగునీటి ప్రాజెక్టుల ఒప్పందాలను రద్దు చేసేందుకు మంత్రివర్గంలో చర్చించడం జరిగింది.

## శాంతియుత పోరాటాల ద్వారా సామాజిక మార్పు సాధించడమే

# గాంధీజీ ఆశయం



**హైదరాబాద్ :** మహాత్మాగాంధీ అనుసరి ంచిన ప్రజాస్వామిక శాంతియుత పోరాట కార్యాచరణ తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో తనకు స్ఫూర్తిగా నిలిచిందని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ తెలిపారు. ప్రజాస్వామిక హక్కుల సాధనకోసం గాంధీజీ అనుసరించిన సత్యాగ్రహ పంథా నేటి యువతరానికీ ఆచరణీయమన్నారు. గాంధీ జయంతి సందర్భంగా దేశ స్వాత ంత్ర్యం కోసం వారి త్యాగనిరతని స్మరిం చుకుంటూ ఆ మహనీయునికి ఘన నివా ళులు అర్పించారు. న్యాయమైన ప్రజల ఆకాంక్షల కోసం, నిరంకుశ ప్రభుత్వాల మీద పోరాడే నాయకత్వం, విశాల దృక్పథంతో తమ పోరాట కార్యాచరణను రూపొందించుకోవాలనే తాత్వికతను గాంధీజీ జీవితం నుంచి నేర్చుకోవాల్సి ఉన్నదని కేసీఆర్ అన్నారు. పీడితులందరినీ సమన్వయం చేసుకుంటూ, భావజాల వ్యాప్తిని చేస్తూ, శాంతియుత పోరాటంలో భిన్న వర్గాలను ఐక్యసంఘటన శక్తిగా తీర్చిదిద్దుకోవాలనే గాంధీజీ ఆశయాలను ప్రతీ ఒక్కరు అనుసరించాలన్నారు.

## రేవంత్‌రెడ్డి, కేటీఆర్ ఆస్తులపై సిట్టింగ్ జడ్జితో

# విచారణ జరపాలి



**సంగారెడ్డి జిల్లా, అక్టోబరు 2 :** కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలపై బీజేపీ మెదక్ ఎంపీ రఘునందన్ రావు కీలక వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల్లోని నేతలు దొంగలేనని ఆరోపిం చారు. ఈరోజు (శుక్రవారం) సంగారెడ్డి జిల్లాలోని రామచంద్రపురంలో మీడియాతో ఎంపీ రఘునందన్ రావు మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మాజీ మంత్రి కేటీఆర్ ఆస్తులపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని తెలంగాణ హైకోర్టుకు వారు లేఖ రాయాలని డిమాండ్ చేశారు. సోమవారం వరకు వారిద్దరూ ఉత్తరం రాయకపోతే స్వయంగా తానే హైకోర్టుకు ఈ విషయంపై ఉత్తరం రాస్తానని ఎంపీ రఘునందన్ తెలిపారు. లేదంటే మన ముగ్గురం వెళ్లి హైకోర్టు సిట్టింగ్ జడ్జికి ఉత్తరం ఇద్దామని చెప్పుకొచ్చారు. తన ఆస్తులపై కూడా విచారణ జరపాలని ఉత్తరం ఇస్తానని ఎంపీ రఘునందన్ రావు పేర్కొన్నారు.

## ట్రై కమిషనరేట్ల

# పునర్వ్యవస్థీకరణ




**హైదరాబాద్ :** గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పునర్వ్యవస్థీకరణ నేపథ్యంలో హైదరాబాద్ సిటీ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ప్రభుత్వం భారీ మార్పులు చేసింది. పోలీసింగ్‌నుమరింతసమర్థవంతంగా నిర్వహించడం, ప్రజలకు వేగంగా సేవలు అందించడం, పర్యవేక్షణనుమెరుగుపరచడం, శాంతిభద్రతలను పటిష్టం చేయడం లక్ష్యంగా జోన్లు, డివిజన్లు, లా అండ్ ఆర్డర్ పోలీస్ స్టేషన్లు, మహిళా పోలీస్ స్టేషన్లు, ట్రాఫిక్ విభాగాలపరిధులనుపునర్వ్యవస్థీకరించింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం జీఓ నెంబర్ 84ను సెప్టెంబరు 30న ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి తరఫున ప్రిన్సిపల్ సెక్రటరీ శిఖా గోయల్ ఈ ఉత్తర్వులు జారీ చేశారు. ఉత్తర్వులు జారీ చేసిన తేదీ నుంచి కొత్త పరిధులు అమలులోకి వస్తాయని శిఖాగోయల్ స్పష్టం చేశారు. శంషాబాద్ పరిధిలో తొండు పల్లి, గొల్లపల్లి, ఘన్‌స్మియాపూర్, హమీదుల్లానగర్, చిన్న గోల్కొండ, పెద్ద గోల్కొండ, శంకరాపూర్, బహదూర్‌గూడ, రషీద్‌గూడ, గండిగూడ, సంగిగూడ, లక్ష్మీతండా, కొత్వాల్‌గూడలోని కొంత ప్రాంతం, పోశెట్టిగూడ గ్రామాలను ఏ పోలీస్ స్టేషన్ పరిధిలోకి చేర్చారు.

# రాష్ట్రస్థాయి పోలీస్ క్రీడల్లో సత్తా చాటిన ఏసిపి మాధవి ఘనంగా సన్మానించిన సీఐ రామకృష్ణ పోలీస్ సిబ్బంది

**ఏసిపి మాధవి, ప్రత్యర్థులకు గట్టి పోటీనిస్తూ నాలుగు స్వర్ణ (గోల్డ్) పతకాలు, ఒక రజత (సిల్వర్) పతకాన్ని సాధించి క్రీడా ప్రాంగణంలో అందరి ప్రశంసలు**



**జమ్మికుంట అక్టోబర్ 02 (ప్రజావాణి)**
ఇటీవల ఎంతో ఘనంగా నిర్వహించిన రాష్ట్రస్థాయి పోలీస్ క్రీడా పోటీల్లో హుజూరాబాద్ సబ్ డివిజన్ అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ (ఏసిపి) మాధవి అసాధారణ ప్రతిభను కనబరిచి శాఖకు ఎనలేని పేరు ప్రఖ్యాతులు తీసుకువచ్చారు. హోరాహోరీగా సాగిన వివిధ క్రీడాంశాల్లో ఆమె అత్యుత్తమ ప్రదర్శనతో ఏకంగా ఐదు పతకాలను సొంతం చేసుకున్నారు. ముఖ్యంగా టేబుల్ టెన్నిస్, బ్యాడ్మింటన్ విభాగాల్లో తనదైన శైలిలో రాణించిన ఏసిపి మాధవి, ప్రత్యర్థులకు గట్టి పోటీనిస్తూ నాలుగు స్వర్ణ (గోల్డ్) పతకాలు, ఒక రజత (సిల్వర్) పతకాన్ని సాధించి క్రీడా ప్రాంగణంలో అందరి ప్రశంసలు అందుకున్నారు.ఏసిపి మాధవి సాధించిన ఈ ఘన విజయాన్ని పురస్కరించుకుని జమ్మికుంట పట్టణ పోలీస్ స్టేషన్ ఆవరణలో జమ్మికుంట సీఐ రామకృష్ణ ఆధ్వర్యంలో ప్రత్యేక అభినందన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు ఈ సందర్భంగా సీఐ రామకృష్ణ, జమ్మికుంట పట్టణ పోలీస్ సిబ్బంది కలిసి ఏసిపి మాధవిని పూలమాలలు, శాలువాతో ఘనంగా సత్కరించారు అనంతరం ఆమెకు పుష్పగుచ్ఛం అందజేసి హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు.ఈ సందర్భంగా సీఐ రామకృష్ణ మాట్లాడుతూ రాత్రింబవళ్ళు శాంతిభద్రతల పరిరక్షణలో నిరంతరం బిజీగా ఉంటూ తీవ్ర ఒత్తిడితో కూడిన విధులను సమర్థవంతంగా నిర్వహిస్తున్నప్పటికీ, క్రీడల పట్ల మక్కువతో సాధన చేసి రాష్ట్రస్థాయి పోటీల్లో ఏకంగా ఐదు పతకాలు సాధించడం సామాన్యమైన విషయం కాదని కొనియాడారు. క్రీడల్లో ఏసిపి మాధవి కనబరిచిన గెలుపు పిలుపు, పట్టుదల పోలీస్ శాఖలోని ప్రతి ఒక్కరికీ ఎంతో స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. మానసిక ఉల్లాసానికి, శారీరక దృఢత్వానికి క్రీడలు ఎంతగానో ఉపయోగపడతాయని, ఆమె విజయం సిబ్బందిలో కొత్త ఉత్సాహాన్ని నింపిందని సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జమ్మికుంట పోలీస్ స్టేషన్ ఎస్సైలు, పోలీస్ సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొని ఏసిపి కు శుభాకాంక్షలు తెలిపారు

# శివసేన యూత్ నూతన కార్యవర్గం ఎన్నిక



**బెజ్జంకి, అక్టోబర్ 2 (ప్రజావాణి)** సిద్దిపేట జిల్లా బెజ్జంకి మండల కేంద్రంలోని నరసింహస్వామి దేవస్థానం ఆవరణలో శివసేన యూత్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ఎన్నికలను శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా యువత సమక్షంలో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.శివసేన యూత్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడిగా గుబీరె హరి ప్రకాశ్, కార్యదర్శిగా గుబీరెశ్రీనివాస్,ఉపాధ్యక్షులుగా లింగాల కమలాకర్, రావుల నరేష్ ఎన్నికైనట్లు నిర్వాహకులు తెలిపారు. నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులకు పలువురు శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా నూతన కార్యవర్గ సభ్యులు మాట్లాడుతూ యువతను ఒకే వేదికపైకి తీసుకువచ్చి ఐకమత్యంతో ముందుకు సాగుతామని అన్నారు. యువతలో సామాజిక బాధ్యతను పెంపొందించడంతో పాటు గ్రామంలో ప్రజలకు ఉపయోగపడే పలు సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహించేందుకు కృషి చేస్తామని తెలిపారు. దేవస్థానం, గ్రామ పరిసరాల పరిశుభ్రత, సేవా కార్యక్రమాలు, యువతకు సంబంధించిన కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటామని పేర్కొన్నారు.

# గాంధీజీ ఆశయాలే నేటి తరానికి మార్గదర్శకం.

- **సత్యం, అహింసా మార్గాలను అనుసరించాలి.**
- **రంగయ్యగారి రామకృష్ణారెడ్డి రాజిరెడ్డి**
- **చేగుంట మండల సర్పంచ్ల ఫోరమ్ అధ్యక్షుడు,బికొండాపూర్ సర్పంచ్**



**చేగుంట:** సత్యం,అహింసా సిద్ధాంతాలతో దేశానికి స్వాతంత్ర్యం సాధించిన జాతిపిత మహాత్మా గాంధీజీ ఆశయాలను నేటి తరం ఆదర్శంగా తీసుకోవాలని చేగుంట మండల సర్పంచ్ల ఫోరమ్ అధ్యక్షుడు, బికొండాపూర్ సర్పంచ్ రంగయ్యగారి రామకృష్ణారెడ్డి రాజిరెడ్డి గారు పిలుపునిచ్చారు. గాంధీజీ జయంతిని పురస్కరించుకుని శుక్రవారం చేగుంట మండలంలోని బి.కొండాపూర్ గ్రామంలో గాంధీ జయంతి సందర్భంగా గాంధీ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా రంగయ్యగారి రామకృష్ణారెడ్డి రాజిరెడ్డి మాట్లాడుతూ.. అహింస, సత్యాగ్రహ మార్గంలో మహాత్మా గాంధీజీ సాగించిన పోరాటం ప్రపంచ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిందన్నారు. ఎలాంటి హింసకు తావులేకుండా సత్యం, అహింసా సిద్ధాంతాలతో స్వాతంత్ర్య ఉద్యమాన్ని నడిపించిన గాంధీజీ జీవితం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు.గాంధీజీ చూపిన మార్గాన్ని నేటి తరం ఆచరించడం ద్వారా సమాజంలో శాంతి, సోదరభావం, ఐక్యత మరింత బలోపేతమవుతాయని అన్నారు.గాంధీజీ కలలుగన్న సమానత్వ సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# బయట నుండి వచ్చే నకిలీ విలేకరులపై తగు చర్యలు తీసు కోవాలని

**జవహర్ నగర్ సిఐకు వినతి పత్రం అందజేసిన స్థానిక విలేకరులు-**



**జవహర్ నగర్ అక్టోబర్ 2 ( ప్రజావాణి ప్రతినిధి)**
మేడ్చల్ జిల్లా కాప్రా మండలం జవహర్ నగర్ ప్రాంతంలో విలేకరులమంటూ ఇతర ప్రాంతాల నుండి వచ్చి నిర్మాణాల వద్ద వసూళ్లకు పాల్పడుతున్న బయటి నుండి వచ్చి జిల్లా స్టాపర్లం మండల రిపోర్టర్లు అంటూ బెదిరింపులకు పాల్పడుతున్న వారి పై చర్యలు తీసుకోవాలని జవహర్ నగర్ స్థానిక విలేకరులు గురువారం జవహర్ నగర్ పోలీస్ స్టేషన్ సిఐ సైదులను కలిసి వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటీవల జవహర్ నగర్ లో మేము విలేకరులమే అంటూ బయట నుండి వచ్చి జవహర్ నగర్ లో ఉన్నవిలేకర్ల బుదుద జల్లి ప్రయత్నం చేస్తున్నారు ఎక్కువైందని వీటిని అరికట్టేందుకు స్థానిక విలేఖరులందరూ కలిసికట్టుగా సీఐని కలిసి వినతిపత్రం అందజేశామన్నారు. జవహర్ నగర్ డేట్ లైన్ తో వార్తలు రాసే విలేకరులతో పాటు, పోలీస్ స్టేషన్ పరిధిలో పనిచేసే విలేకరులను గుర్తించి త్వరలో సమావేశాన్ని ఏర్పాటు చేస్తామని ఇష్టానుసారంగా ఇతర ప్రాంతాల నుంచి వచ్చి ఇక్కడ బెదిరింపులకు పాల్పడితే తగిన చర్యలు తీసుకుంటామని విలేకరులు హెచ్చరించారు దీనిపై ముందస్తుగా సిఐకి సమాచారం అందించామని త్వరలోనే పూర్తిస్థాయి కార్యచరణ చేపడతామన్నారు. ఇప్పటికే ఇతర ప్రాంతాల నుంచి వచ్చి ఇక్కడ బెదిరింపులకు పాల్పడే వారిపై నిఘా ఏర్పాటు చేశామని వారిపై కచ్చితంగా పోలీసు కేసు నమోదు చేసే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. స్థానిక సమస్యలపై అవగాహన లేనివాళ్లు వార్తలు రాయక ఎక్కడి నుంచో వచ్చి వసూళ్లకు పాల్పడితే ఎట్టి పరిస్థితుల్లో ఇక ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. సుదూర ప్రాంతాల నుంచి జవహర్ నగర్ వచ్చి ఇక్కడ బెదిరింపులకు పాల్పడుతూ అక్రమంగా వసూలు చేస్తున్న విలేకరులకు సహకరిస్తున్న వారికి సైతం తగిన బుద్ధి చెప్తామని హెచ్చరించారు. స్థానిక ప్రజాప్రతినిధులు నాయకులు, అధికారులు తదితరులు నిబద్ధతతో పనిచేసే విలేకరులకు సహకరించాలని కోరారు.

# జాతిపిత మహాత్మా గాంధీ జయంతి



**నర్సాపూర్:** జాతిపిత మహాత్మా గాంధీ జయంతిని పురస్కరించుకుని నర్సాపూర్ పట్టణంలో ఆయన విగ్రహానికి మెదక్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్ గారు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.అనంతరం రెడ్డిపల్లి గ్రామంలో చెత్త బుట్టలను పంపిణీ చేసి, శ్రమదానం కార్యక్రమంలో పాల్గొన్నారు. గ్రామ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, స్వచ్ఛతతో పాటు సామాజిక బాధ్యతను పెంపొందించుకోవాల్సిన అవసరం ఉందని ఈ సందర్భంగా పేర్కొన్నారు.మహాత్మా గాంధీజీ చూపిన సత్యం, అహింస, శాంతి, మానవత్వం, సామాజిక న్యాయం వంటి మహోన్నత విలువలు నేటికీ సమాజానికి మార్గదర్శకంగా నిలుస్తున్నాయని అన్నారు. గాంధీజీ కలలు కన్న సమానత్వం, సామాజిక న్యాయం, శాంతి, సౌభ్రాతృత్వంతో కూడిన సమాజ నిర్మాణం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. పేదలు, బలహీనవర్గాలు, అణగారిన ప్రజల సంక్షేమానికి అంకితభావంతో పనిచేయడమే మహాత్మా గాంధీకి మనం అందించే నిజమైన నివాళి అని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో నర్సాపూర్ మున్సిపల్ చైర్మన్ లక్ష్మి రాజు యాదవ్, రెడ్డిపల్లి సర్పంచ్ పద్మావతి అశోక్ గౌడ్,జిల్లా ఉపాధ్యక్షులు అశోక్, ప్రధాన కార్యదర్శి మేఘమాల, శ్రవణ్ కుమార్,కార్యదర్శి స్వాతి, నాయకులు,రాధకృష్ణ, రషీద్,సుధీర్ కుమార్, ఆంజనేయులు, నరేష్, సందీప్, నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొనారు

# గాంధీ మార్గమే యువతకు దిక్సూచి!

**అహింసా సిద్ధాంతంతో దేశానికి స్వాతంత్ర్యం అందించిన మహాత్ముడి సేవలు చిరస్మరణీయం**

**గాంధీజీ ఆశయాలను భావితరాలకు అందించాలి: కూకట్‌పల్లి ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ నవీన్‌కుమార్**



**కూకట్‌పల్లి, అక్టోబర్ 2 (ప్రజావాణి):** మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా కేపీహెచ్‌బీ రోడ్ నంబర్ ఒకటి వద్ద గాంధీ విగ్రహానికి కూకట్‌పల్లి ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ నవీన్‌కుమార్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అహింసను ఆయుధంగా మలుచుకుని దేశ స్వాతంత్ర్యం కోసం గాంధీజీ చేసిన పోరాటం నేటి యువతకు ఆదర్శంగా నిలవాలని అన్నారు. గాంధీజీ ఆశయాల బాటలో నడుస్తూ దేశ శ్రేయస్సు కోసం యువత ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. మహనీయుల త్యాగాలు, సేవలను భావితరాలకు అందించాల్సిన బాధ్యత తల్లిదండ్రులు, ఉపాధ్యాయులపై ఉందన్నారుకార్యక్రమంలో భారత రాష్ట్ర సమితి కూకట్‌పల్లి నియోజకవర్గ కోఆర్డినేటర్ సతీష్ అరోరా, మాజీ కార్పొరేటర్ పగుడాల శిరీష బాబురావు, నాయకులు వెంకటేష్, పవన్, మహిళా నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# పోరాటాల ద్వారానే కార్మిక హక్కులు కాపాడబడతాయి సిఐటియు జిల్లా కార్యదర్శి సుంచు విజేందర్

**సిఐటియులో చేరిన స్టేషన్ ఘన్పూర్ ఆర్పీలు**



**జనగామ జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 02(ప్రజావాణి):**
పోరాటాల ద్వారానే కార్మికుల హక్కులు సాధించబడతాయని, "ఐక్యత పోరాటం" అనే ఆచరణాత్మక నినాదంతో దేశంలోనే అతిపెద్ద కార్మిక సంఘంగా సిఐటియు ఉందని, సిఐటియు చేస్తున్న పోరాటాలకు ఆకర్షితులై జనగామ జిల్లా స్టేషన్ ఘన్పూర్ మున్సిపల్ పరిధిలో పనిచేస్తున్న 17 మంది రిసోర్స్ పర్సన్స్ (ఆర్పీ) సీఐటీయూలో చేరారని సిఐటియు జిల్లా కార్యదర్శి సుంచు విజేందర్ అన్నారు.ఈ సందర్భంగా స్టేషన్ ఘన్పూర్ లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆర్పీలకు సిఐటియు కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. యూనియన్ అధ్యక్షురాలు గుర్రం వసంత అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో సుంచు విజేందర్ మాట్లాడుతూమహిళా సంఘాలు, స్వయం సహాయక సంఘాల కార్యకలాపాలతో పాటు ప్రభుత్వం తీసుకువచ్చిన అనేక సంక్షేమ పథకాలను, వార్డులలో సర్వేలు, డిజిటల్ యాప్ లలో వివరాల నమోదు వంటి అనేక కార్యక్రమాలను నిర్వర్తిస్తూ, అవగాహన సదస్సుల ద్వారా ప్రజలను చైతన్యం చేస్తున్న ఆర్పీలపై అదనపు బాధ్యతలు మోపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.ఇప్పటికే పనిభారం అధికంగా ఉన్నప్పటికీ అదనపు పనులు అప్పగించడం వలన ఆర్పీలు తీవ్ర ఒత్తిడికి గురై అనారోగ్యాల పాలవుతున్నారని అన్నారు. ప్రభుత్వాలు మారుతున్నా, ఎన్నికల ముందు ఆర్పీలకు అనేక వాగ్దానాలు చేసి అమలు చేయకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నాయని విమర్శించారు.కొత్తగా ఏర్పడిన స్టేషన్ ఘన్పూర్ మున్సిపాలిటీలో పనిచేస్తున్న 19 మంది ఆర్పీలకు అనేక సమస్యలు ఎదురవుతున్నాయని, సంబంధిత అధికారులు సానుకూలంగా వ్యవహరించి ఆర్పీలతో పని చేయించుకోవాలని కోరారు.సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం – నెలకు రూ. 26,000/– వేతనం ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆర్పీలకు ఉద్యోగ భద్రత, ప్రభుత్వ గుర్తింపు కార్డులు, ఇన్సూరెన్స్, యూనిఫార్మ్ ఇవ్వాలని, అదనపు సర్వేలు, యాప్ ల పని భారాన్ని తగ్గించి, విధి నిర్వహణకు అవసరమైన సాంకేతిక సదుపాయాలు కల్పించి శిక్షణ ఇవ్వాలని, పని గంటలను క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో ఆర్పీలు నీల విజయలక్ష్మి, పొన్న మంజుల, బోయిని భాగ్యలక్ష్మి, గట్టు స్వరూప, సింగపురం అనిత, తాటికొండ మంజుల, సింగపురం రజిత, బూర్ల రమ్య, వంగ సరిత, వేల్పుల స్వరూప, గట్టు మాధవి, మామిడాల గీత, గుర్రం అనిత తదితరులు పాల్గొన్నారు.

# పాఠశాల సిబ్బంది సమగ్ర వివరాల సేకరణ పూర్తి

**జిల్లా కలెక్టర్, జిల్లా విద్యాధికారికి పెద్దపల్లి జిల్లా పీఈటీల కృతజ్ఞతలు**



**పెద్దపల్లి:** జిల్లా కలెక్టర్, జిల్లా మేజిస్ట్రేట్ ఆదేశాల మేరకు, జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో పెద్దపల్లి జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో పాఠశాల సిబ్బందికి సంబంధించిన సమగ్ర వివరాల పట్టిక తయారు చేసే కార్యక్రమాన్ని చేపట్టారు. గత 30 రోజులుగా కొనసాగిన ఈ కార్యక్రమం నిన్నటితో విజయవంతంగా పూర్తయింది.ఈ కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని వివిధ పాఠశాలలను సందర్శించిన పెద్దపల్లి జిల్లా పీఈటీలు, పాఠశాల సిబ్బందికి సంబంధించిన వివరాలను సేకరించి, పరిశీలించి, సమగ్రంగా నమోదు చేసే బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించారు. ఈ ప్రత్యేక విధుల్లో పాల్గొనేందుకు ఆన్ డ్యూటీ అవకాశం కల్పించి, తమ సేవలను వినియోగించుకున్నందుకు జిల్లా కలెక్టర్ గారిని, జిల్లా విద్యాధికారి గారిని పీఈటీల ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిసి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.తమపై నమ్మకం ఉంచి ఇంత కీలకమైన బాధ్యతను అప్పగించినందుకు జిల్లా కలెక్టర్ గారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. అలాగే కార్యక్రమాన్ని సమన్వయం చేస్తూ, విధుల నిర్వహణలో అవసరమైన సహకారం, మార్గదర్శకత్వం అందించిన జిల్లా విద్యాధికారి గారికి కూడా పెద్దపల్లి జిల్లా పీఈటీలు కృతజ్ఞతలు తెలిపారు.తమకు అప్పగించిన బాధ్యతను విజయవంతంగా పూర్తి చేయడానికి అవకాశం కల్పించడం పట్ల పీఈటీలు సంతోషం వ్యక్తం చేశారు.భవిష్యత్తులో కూడా విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించే వివిధ కార్యక్రమాల్లో తమ వంతు బాధ్యతను అంకితభావంతో, సమర్థవంతంగా నిర్వర్తిస్తూ, విద్యాశాఖ అభివృద్ధికి పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు.


Printed, Published and Owned by RAYINIPATLA KUMARASWAMY, Printed at RAMANI WEB OFFSET PRINTERS, Auto Nagar, Bommakal, Karimnagar, Editor : RAYINIPATLA KUMARASWAMY, MANAPRAJAVAANI BROAD CASTING AND PUBLICATIONS, Ankireddypally, Thanggellapally, Rajanna Sircilla, TELANGANA-505405. RNI NO:TGTEL/25/A5443 Contact No : 9440032006. MAIL ID : Kumaraswamyrayinipatla@gmail.com